జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 17-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 730 పేజీలు: 4 వెల: రూ.7



# గంజాయి లేడీ డాన్‌కు.. ఏడాది జైలు!

✳ గంజాయి డాన్ సావిత్రిపై 'పీఐటీ ఎన్డీపీఎస్' చట్టం ✳ ఆమెపై పలు కేసులు.. అయినా మారని తీరు ✳ ప్రభుత్వానికి లేఖ రాసిన ఎస్పీ ✳ ఏడాది పోలీసు నిర్బంధంలో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ✳ పోలీసుల చర్యలపై బెంబేలెత్తిపోతున్న గంజాయి ముఠాలు, రౌడీషీటర్లు ✳ కఠిన నిర్ణయం తీసుకుంటున్న ఎక్సైజ్, పోలీసు శాఖ

శ్రీకాకుళంక్రైం/ఇచ్ఛాపురం, జులై 16 (వార్త): మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పాల్పడుతూ యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి ముఠాల గుండెల్లో వణుకు పుట్టేలా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పురుషోత్తపురం గ్రామ చిన్నవీధికి చెందిన కుప్రసిద్ధ గంజాయి వ్యాపారి బుగ్గ సావిత్రి (46)పై పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం కింద జారీ చేసిన డిటెన్షన్ ఉత్తర్వులను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఆమెను జూన్ 17, 2026 నుంచి ఏడాది పాటు నిర్బంధంలో ఉంచాలని ఆదేశిస్తూ రెవెన్యూ (ఎక్సైజ్-2) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా గురువారం జీవో ఆర్టీ నంబర్ 1232ను విడుదల చేశారు. ప్రస్తుతం విశాఖపట్నం సెంట్రల్ జైల్లో ఉన్న నిందితురాలికి ఈ ఉత్తర్వులను తక్షణమే వినిపించి, అమలు చేయాలని జైలు అధికారులను ఆదేశించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈమె అక్రమ దందాపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. ఒడిశా రాష్ట్రం చంద్రగిరి ప్రాంతానికి చెందిన మన్యువల్ బీరా అనే వ్యక్తి నుంచి రహస్యంగా గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం తరలించడమే కాకుండా, అక్కడ లారీ డ్రైవర్లు, ఇతర వ్యసనపరులకు విక్రయిస్తూ సావిత్రి భారీ ఎత్తున నెట్‌వర్క్ నడుపుతోంది. ఈమెపై ఇప్పటికే ఎన్డీపీఎస్ చట్టం కింద పలు కేసులు నమోదైనప్పటికీ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, సమాజ శ్రేయస్సుకు నిరంతరం ముప్పుగా పరిణమించిందని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ ప్రభుత్వానికి నివేదించారు. సాధారణ చట్టాలు ఈమె అక్రమ రవాణాను అడ్డుకోవడంలో విఫలం కావడంతో, గంజాయి సాగు, రవాణా నిరోధక కఠిన చట్టాన్ని ప్రయోగించక తప్పలేదు. ఈ నిర్బంధ కేసును నిశితంగా పరిశీలించిన ఉన్నత స్థాయి సలహా మండలి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించింది. రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ నీలం సంజీవరెడ్డి నేతృత్వంలోని అడ్వైజరీ బోర్డు ఈనెల 7న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపి, నిందితురాలిని




సమాజం నుంచి దూరంగా ఉంచడమే సరైన చర్యగా స్పష్టం చేసింది. బోర్డు సిఫార్సుల మేరకు పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం 1988 లోని సెక్షన్ 3(1) ప్రకారం బుగ్గ సావిత్రిని 12 నెలల పాటు జైల్లోనే ఉంచేలా ప్రభుత్వం తుది ఉత్తర్వులు జారీ చేసింది. అసాంఘిక శక్తులకు, మత్తు దందా నడిపేవారికి ఈ కఠిన చర్య ఒక గట్టి హెచ్చరికగా నిలవనుంది.

## హడలిపోతున్న రౌడీషీటర్లు, గంజాయి ముఠాలు..

కాగా, రౌడీషీటర్లపై పీడీ యాక్ట్, గంజాయి ముఠాలపై ఎన్డీపీఎస్ చట్టాన్ని పోలీసులు కడుతుండడంతో వారంతా బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల సంతబొమ్మాళి మండలానికి చెందిన ఓ వ్యక్తిపై పీడీ యాక్ట్ పెట్టి జైలులో పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇచ్ఛాపురానికి చెందిన సావిత్రిపై ఎన్డీపీఎస్ చట్టాన్ని అమలు చేస్తూ ఏడాది పాటు కటకటాల్లోకి నెట్టారు. ఈ రెండు ఘటనలు కూడా రౌడీషీటర్లు, గంజాయి ముఠాలను భయకంపితులను చేసింది. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తమ పని తాము చేసుకుపోతామని జిల్లా పోలీస్ బాస్ డైరెక్టుగా హెచ్చరికలు చేస్తుండడంతో వారంతా హడలిపోతున్నారు. ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. అయితే కొందరు రౌడీషీటర్లు ఇంకా ఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు గైర్హాజరువుతున్నట్టు సమాచారం. రాజకీయ పార్టీ అండదండలు ఉండడంతోనే వారు కౌన్సెలింగ్‌కు రావడం లేదన్న గుసగుసలు ఉన్నాయి.



# తమ్ముళ్లకు.. టిడ్కో.. గుబులు!

✳ డిపాజిట్లు వాపస్‌తో కొత్త టెన్షన్ ✳ ఒక్కో డీడీకి గతంలో సుమారు రూ.20వేలు వరకు అమ్యామ్యాలు వసూలు ✳ ప్రస్తుతం డీడీ సొమ్ములు మాత్రమే చెల్లింపు ✳ అదనపు పైకం మాటేమిటని నిలదీస్తున్న లబ్ధిదారులు

ఇచ్ఛాపురం, జులై 16 (వార్త):
ఉరుము ఉరిమి మంగళం మీద పడడం అంటే ఇదేనేమో? ఎప్పుడో మర్చిపోయిన గాయాన్ని మళ్లీ లేపించుకోవడం అంటే ఇదే కాబోలు. అది కూడా మున్సిపల్ ఎన్నికలకు ముందు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో టిడ్కో లబ్ధిదారులకు చెల్లించిన డిపాజిట్లు వాపస్ చేస్తుండడంతో అది కాస్త తమ్ముళ్లకు తలనొప్పిగా మారింది. 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బోర్డర్ అమీన్ సాహెబ్ పేటలో రెండు విడతల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఏపీ టౌన్షిప్ కార్పొరేషన్ డెవలప్మెంట్ కింద టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందుకుగాను అరులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపాలిటీలో 743 మంది ఇళ్ళు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీళ్ళకి మొదటి దశలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 192 మందికి మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయి. మిగిలిన 551 మందికి మంజూరు కాలేదు. ఇళ్ల నిర్మాణం పూర్తయి దాదాపు అందజేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అనంతరం వచ్చిన వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించింది. ఇళ్లు రానివారికి అమిన్ సాయిబ్ పేట తుఫాన్ సెంటర్ వద్ద సెంటు చొప్పున స్థలం కేటాయించింది. 300 ,360 ,430 చదరపు గజాల ప్లాట్లను నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 300 చదరపు గజాల ఫ్లాట్ కోసం 500 రూపాయలు డిడి చెల్లించాలి. ఇందుకుగాను ఒక్కో లబ్ధిదారుని వద్ద అప్పట్లో 5000 రూపాయల నుండి 10000 రూపాయల వరకు అదనంగా వసూలు చేశారు. 360 గజాలు నిర్మాణం చేపట్టలేదు. 430 చదరపు గజాల నిర్మాణం కోసం లక్ష రూపాయల డి డీ రూపంలో చెల్లించారు. ఇందుకు గాను ఒక్కో డిడికి అదనంగా 20,000 రూపాయలు నుండి 30000 రూపాయల వరకు వసూలు చేశారు. 300 చదరపు గజాలు ఇళ్ళు 144 మందికి మంజూరు అయింది. 430 చదరపు గజాల ఇల్లు కేవలం 48 మందికి మాత్రమే మంజూరు అయింది. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్, రెండో ఫ్లోర్ విధానంలో అపార్ట్మెంట్ తరహాలో వాల్ షీట్ టెక్నాలజీతో నిర్మాణం చేపట్టారు. ఇంకా అక్కడ మౌలిక వసతులు ఏవి కల్పించలేదు. దాదాపు దశాబ్ద కాలం పూర్తయింది. మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండో దశ నిర్మాణం చేపట్టి మిగిలిన వారికి ఇల్లు మంజూరు చేస్తారని భావించారు. కానీ ఇందుకు భిన్నంగా ఇల్లు మంజూరు కాని వారికి డిపాజిట్లు వాపస్ చేశారు. చెక్ రూపంలో 551 మందికి డిపాజిట్లు తిరిగి చెల్లిస్తున్నారు. ఇక్కడే అసలు చిక్కు మొదలైంది. అప్పట్లో డిడిలు తీయమని కొంతమంది మధ్యవర్తులను ఆశ్రయించారు. అధిక శాతం నిరుపేదలు కావడం నిరక్షరాస్యులు కావడంతో రికమండేషన్ లేకపోతే ఇల్లు మంజూరు కావని భయంతో అదనంగా అభ్యర్థులు 5000 నుండి 30 వేల రూపాయలు వరకు చెల్లించారు. ప్రస్తుతం డిపాజిట్లు మాత్రమే చెల్లిస్తున్నారు. డిడిల కోసం ప్రయత్నం చేస్తే అప్పట్లో కొంతమందికి రసీదులు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. అందరూ కమిషనర్ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పేరుతో అప్పటి ఆంధ్రా బ్యాంకులో డిడీలు తీశారు. 360 గజాలు ఇల్లు మంజూరు కానప్పటికీ 12,500 రూపాయల డిడి చొప్పున తీయించారు. ఇందుకు అదనంగా 5000 నుండి 10000 వరకు వసూలు చేశారు. కొంతమందికి డీడీలు తీయకుండానే తీసేశామని చెప్పి మభ్యపెట్టినట్లు తెలుస్తోంది. తాము లక్ష చెల్లించామని, 50,000 చెల్లించామని, పాతికవేలు చెల్లించామని మున్సిపల్ కార్యాలయంలో వాళ్ల పేరుతో అక్కడ వెతికితే డీడీలు లేవు. దీంతో లబ్ధిదారులు మధ్యవర్తుల వద్దకు వెళ్లి నిలదీస్తున్నారు. ఒక్కో వార్డులో ఒక్కోరకంగా వసూలు చేశారు. ప్రస్తుతం ఇల్లు మంజూరు కాని వారికి డబ్బులు వాపస్ చేస్తుండడంతో అదనంగా చెల్లించిన డబ్బులు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవన్నీ అప్పటి కాగితాల కోసం అధికారుల కోసం ఖర్చు చేశామని చెప్పి తప్పించుకునే ధోరణిలో ఉన్నారు. గతంలో పార్టీ మారిన ఓ నాయకుడు చాలామంది లబ్ధిదారుల వద్ద డీడీలు తీయకుండానే డిడి సొమ్ముతోపాటు అదనంగా ఇచ్చిన సొమ్మును కూడా నొక్కేసినట్లు సమాచారం. మరికొద్ది నెలల్లో మున్సిపల్ ఎన్నికలు ముందు ఇది తల బొప్పి కట్టే వ్యవహారం లాగా మారింది. కొస మెరుపు ఏమిటంటే అప్పట్లో కనీసం కౌన్సిలర్ కూడా కానీ ఓ యువకుడు మున్సిపాలిటీకి సంబంధం లేని మండపల్లి, తోటూరు లాంటి ఇతర ప్రాంతాలకు చెందిన వారి వద్ద ఈ డబ్బులతో పాటు ఈస్ట్ ఫేషింగ్, సౌత్ ఫేషింగ్ గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు ఇప్పిస్తామని వీటికి అదనంగా మరో 10 వేలు నొక్కేసినట్లు సమాచారం. లిఫ్ట్ పక్కన ఇస్తాము కార్ పార్కింగ్ ఇప్పిస్తామని గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ రేంజ్ లో కూడా మభ్య పెట్టారని సమాచారం.

(ఎవరెవరు ఎవరెవరి వద్ద ఎంత ఎంత చొప్పున వసూలు చేశారో పూర్తిస్థాయిలో 'జాతీయ వార్త' మరో కథనంలో కలుద్దాం)



## కదిలిన జగన్నాథ రథచక్రాలు

✳ జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా రథయాత్ర

శ్రీకాకుళం, జులై 6(వార్త):జిల్లావ్యాప్తంగా జగన్నాథ రథయాత్ర గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. బలభద్ర, సుభద్ర సమేత శ్రీజగన్నాథుడు రథంపై జగన్నాథుని మందిరం నుంచి గుండిచా మందిరానికి ఊరేగింపుగా వెళ్లారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ రథం లాగేందుకు పోటీపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని బొందిలీపురం జగన్నాథ మందిరం నుంచి ఇల్లిసిపురం గుండిచా మందిరం వరకూ రథయాత్ర అశేష భక్తుల నడుమ సాగింది. ఆలయ ప్రధాన పూజారి సుభాష్ చంద్ర పండా స్వామి వారికి పూజలు చేశారు. తొమ్మిది రోజులు పాటు రోజుకో అవతారంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలను ప్రత్యేకంగా అలంకరిస్తామని బాలు పాణిగ్రాహి వెల్లడించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఎరువు ..కరువు..!

- ఎరువుల కొరతతో రైతన్నల గుండెల్లో దడ
- ఎకరానికి ఒక బస్తా పరిమితి
- ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు
- మంత్రి ఇలాఖాలోనే కొరతపై అన్నదాతల ఆవేదన
- ప్రభుత్వం తగినన్ని ఎరువులు సరఫరా చేయాలని వినతి



**ఆమదాలవలస, జులై 16 (వార్త):** జిల్లా రైతులు తీవ్ర వర్షాలు కురవక ఇప్పటికే విత్తనాలు వేసిన పంటలపై ఎరువుల కొరతతో ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు రైతులు ఆందోళన చెందుతుండగా, మరోవైపు ఎరువులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయాల వద్ద రోజంతా క్యూల్లో నిల్చున్నా ఎకరానికి ఒక్క బస్తా మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. అలాగే ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరో పణలు వినిపిస్తున్నాయి. పెద్ద రైతులకు ఎరువులు అందుతున్నా, సన్నకారు రైతులు మాత్రం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయానికి వచ్చిన సుమారు 200 బస్తాల ఎరు వులు రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని, వ్యవసాయ పనులు దెబ్బతింటాయనే భయంతో రైతులు గుండెల్లో దడతో ఉన్నారు. జిల్లాకు వ్యవ సాయ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఎరువుల సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే తగినంత ఎరువులు అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విక్ర యాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## మొక్కు తీర్చుకున్న చంద్రబాబు అభిమాని

- ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు

ట్రై సైకిల్‌పై వెళ్లిన బూరగాం వికలాంగ యువకుడు




**కంచిలి, జులై 16 (వార్త):** టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు సీఎం కావాలని బూరగాం గ్రామానికి చెందిన వికలాంగ యువకుడు నెయ్యిల ప్రసాద్ తిరుమల వెంకన్న స్వామిని మొక్కుకున్నాడు. అతడి కోరిక నెరవేరడంతో కొద్దిరోజులు క్రితం ఇచ్ఛాపురం ఎంఎల్ఏ బెందాళం అశోక్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆమదాలవలస ఎంఎల్ఏ కూన రవికుమార్ ఆశీస్సులుతో తిరుపతికి తన మూడు చక్రాల రిక్షా పైనే సుమారు వెయ్యి కిలోమీటర్లు ప్రయాణం చేసి స్వామి వారిని దర్శించి మొక్కు తీర్చుకున్నాడు. తిరుగు ప్రయాణంలో అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి ఆశీస్సులు పొందాడు. ప్రసాద్ లాంటి అంకితభావం గల కార్యకర్తను పార్టీ ఎల్లవేళలా గుర్తిస్తుందని సీఎం పేర్కొన్నట్లు తెలిపారు.

## వినియోగంలోకి చెత్త సంపద కేంద్రం




**జి.సిగడాం, జులై 16(వార్త):** పెంట గ్రామంలో ఉన్న చెత్త సంపద సేకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ నెల 13న ' ఎంపీడీవో పెంట గ్రామ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం ఉండడం పై ఆయన అసంతృప్తి చెందారు. చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోనికి తీసుకురావాలని కూటమి నాయకులు మక్క నారాయణరావు ఆద్వర్యంలో పంచాయితీ కార్యదర్శినకు ఆదేశాలు జారీచేశారు. వెంటనే అధికారులు స్పందించారు. మక్క నారాయణరావు, పంచాయితీ కార్యదర్శి అల్లాడ దుర్గారావు సమన్వయంతో కలిసి గురువారం గ్రీన్ అంబాసిడర్లు ద్వారా పను చేపట్టి నిరుపయోగ కరంగా ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాన్ని వినియోగంలోనికి తీసుకువచ్చారు.

## గ్రామ.. గ్రామాన ..

## మన డబ్బులు.. మన లెక్కలు ర్యాలీలు



**మందస, జులై 16(వార్త):** మహిళా సంఘాల లెక్కలు పారదర్శకంగా సభ్యులందరికీ తెలియాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమం ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు అన్ని గ్రామ సంఘాలలో క్లస్టర్ కోఆర్డినేటర్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తూ సంఘ సభ్యులకు జీవనోపాదులు పై అవగాహన కల్పిస్తున్నట్లు మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుభప్రదంగా ఈశాన్యం కొత్తపల్లి పంచాయతీ ముకుందపురం నుంచి గురువారం ఈ కార్యక్రమం ర్యాలీ ప్రారంభించారు. ముందుగా సంఘ సభ్యులకు సూపర్ నారీ యాప్ డౌన్ లోడ్ చేయించి అవగాహన కల్పించారు. ప్రతీ సంఘం పొదుపులు, అప్పుల వివరాలు సభ్యురాలు వారీ ఆర్థిక లావాదేవీలు ఆ సూపర్ నారీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవడం ద్వారా సంఘ సభ్యుల మధ్య జవాబుదారీతనం పెరిగి పారదర్శకత వస్తుందన్నారు. సంఘ సభ్యులకు ప్రభుత్వం ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంక్ ల ద్వారా అందజేస్తున్న ఋణ సౌకర్యాలును వినియోగించుకొని ప్రతీ ఒక్క సభ్యురాలు కూడా ఒక మహిళా ఎంటర్ ప్రైనర్ కావాలనే ప్రభుత్వ ఆశయం, సంకల్పానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, గ్రామ సంఘం వి.ఓ.ఏ. చంద్రకళ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీ ఓటు.. మా హామీ

- ఓటర్ల జాబితాపై తహసీల్దార్ భరోసా

**సోంపేట, జులై 16 (వార్త):** కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి ఇచ్చిన పదిరోజులు అదనపు గడువును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సోంపేట తహసీల్దార్ బి. అప్పలస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం మండలంలో బిఎల్ఓ లు, బిఎల్ఏలు సిబ్బందితో కూడిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరి ఓట్లు ఎక్కడికో పోతాయనే ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి దశలోనూ ఇచ్చిన గడువు లోగా అభ్యంతరాలను ఎత్తి చూపుతూ సమస్యలు వున్నప్పుడు సరిచేసుకోవాలని అన్నారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తునట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియలో బిఎల్ఓ ల పనితీరును తహసీల్దార్ ప్రశంశించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సమన్వయము చేస్తున్న తహసీల్దార్ను ఇరువర్గాలు అభినందించారు. ఈ సమావేశంలో డీటీ ఉమామహేష్, ఆర్ఐ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ గారూ.. జైన, బౌద్ధ స్థలాలను పరిరక్షించండి

- స్వప్నిల్‌కు ప్రాచీన కట్టడాల పరిరక్షణ సమితి వినతిపత్రం

**మందస, జులై 16(వార్త):** మందస ప్రాంతంలోని ప్రాచీన జైన, అవశేషాలను, విగ్రహాలను పరిరక్షించాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు గురువారం ప్రాచీన కట్టడాల పరిరక్షణ సమితి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ నల్లి ధర్మారావు మాట్లాడుతూ గోపాలసాగరం అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న ఓపెన్ జిమ్ పార్క్ వంటి నిర్మాణాలకు ప్రత్యమ్నాయ స్థలం ఉన్నప్పటికీ, జైన విగ్రహం, మరికొన్ని అవశేషాలు కనిపిస్తున్న ఆలయ పరిసరాలను, పార్క్ కోసం యంత్రాలతో ధ్వంసం చేయడం చరిత్ర వంచనకు పాల్పడడమే అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే, ఒక ప్రాచీన మండపాన్ని కూల్చి వేశారని, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన వారు సకాలంలో స్పందించక పోవడం వలన ప్రాచీన రాతి ఫ్లోరింగ్ ను ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, చరిత్ర ప్రేమికులు పదేపదే కాంట్రాక్టర్ కి చెబుతున్నప్పటికీ పెడచెవిన పెట్టారని కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిని దుయ్యపట్టారు. తక్షణమే పనులు నిలిపివేసి, కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ పరిసర ప్రాంతాల్లోనే గోవర్ధనగిరి మెట్ట, ఆనంద గిరి మెట్టపై బయటపడిన



మరికొన్ని జైన, బౌద్ధ అవశేషాలను కూడా పరిరక్షించాలని కోరారు. కలెక్టర్ ను కలసిన వారిలో రచయితలు, చరిత్ర పరిశోధకులు నల్లి ధర్మారావు, మామిడి కోదండరావు, సీనియర్ జర్నలిస్ట్, కళింగాంధ్ర చరిత్ర అభిమాని సున్నపు చిన్నారావు ఉన్నారు. వినతి పత్రాన్ని పూర్తిగా చదివి, తక్షణమే తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రముఖ రచయితలు, పరిశోధకులు నల్లి ధర్మారావు, దుప్పల రవికుమార్, మామిడి కోదండరావు, ప్రముఖ సైకత శిల్పి గేదెల హరికృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ సున్నపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## దానయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ



**పలాస, జులై 16 (వార్త):** పలాసలో దుబ్బ దానయ్య అనే నిరుపేద గొర్రెల కాపరి మరణించిన ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని, ముందుగా దానయ్య కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి వజ్జ బాబురావు గురువారం తెలియజేశారు. ఆక్సిడెంట్ అనేది ఎవరూ కావాలని చేసే పని కాదని, ప్రమాదాలు అనుకోకుండా జరుగుతాయి. కానీ ప్రమాదం జరిగిన తర్వాత ఎలా ప్రవర్తించాం అనేదే ఒక వ్యక్తి బాధ్యతను, మానవత్వాన్ని తెలియ జేస్తుందన్నారు. ఈ ఘటనలో ప్రజల మనసుల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించేందుకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వలేదు?, ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందించి ఉంటే ప్రాణాలు దక్కేవా అనే సందేహానికి సమాధా నం ఎవరు చెబుతారని ప్రశ్నించారు. ఈ కేసులో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగిందా లేదా?, అసలు సంఘటనలో ఎవరు ఉన్నారు, ఎవరు వాహనం నడిపారు అనే అంశాలపై ఎందుకు వివాదాలు వచ్చాయని ప్రశ్నించారు. ఒక అమాయక యువకుడిపై కేసు మళ్లించే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నా యని,? మాజీ మంత్రిగా పనిచేసిన వ్యక్తికి చట్టం గురించి అవగాహన ఉండాలన్నారు. అలాంటి వ్యక్తి చట్టానికి పూర్తిగా సహకరించి, వాస్తవాలు బయ టకు వచ్చేలా వ్యవహరించాల్సింది పోయి, తన కుమారుడిని రక్షించే ప్రయత్నం చేశారనే అభిప్రా యం ప్రజల్లో ఏర్పడడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో పోలీసులు నమోదు చేసినవి హత్య (మర్డర్) సెక్షన్లు కాదని, దర్యాప్తుకు ఆటంకం కల్పించడం, ఆధారాలను ప్రభావితం చేయడం లేదా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం వంటి ఆరోపణలకు సంబంధించిన సెక్షన్లు ఉన్నాయని సమాచారం. చట్టం తన పని తాను చేస్తుంది. ఏ సెక్షన్లు వర్తిస్తాయో నిర్ణయించేది కోర్టు అని, దర్యాప్తు సంస్థలే, అందుకే ఈ ఘటనను రాజకీయ ప్రచా రంగా మార్చి "మర్డర్ కేసు" అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైంది కాదన్నారు. నిజాలు ఏవైతే ఉన్నాయో అవే ప్రజల ముందుకు రావాలి. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే దుబ్బ దానయ్య కుటుంబం నేడు పెద్ద దిక్కును కోల్పో యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి న్యాయం జరగాలని, వారికి ఆర్థిక, సామాజిక భరోసా కల్పించాలని, ఎవరి రాజకీయాలు, ఎవరి వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే ఒక పేద కుటుంబం జీవితం ఎంతో విలువైనదని అన్నారు. మా ప్రభుత్వం ఇప్పటికే బాధిత కుటుంబానికి అండగా నిలిచిందని, అయినప్పటికీ, ఈ ఘటనలో నైతిక బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుటుంబానికి అండగా నిలవాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. మాజీ మంత్రి సీదిరి అప్ప లరాజుకి నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీ యాలు పక్కన పెట్టండి. చట్టాన్ని గౌరవించండి. దర్యాప్తుకు పూర్తిగా సహకరించండి. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి న్యాయం జరిగేలా మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి. అదే ప్రజాస్వామ్యానికి, మానవత్వానికి, ప్రజా జీవితానికి తగిన వైఖరి అవుతుందన్నారు.

# పలాసలో జగన్నాథ రథయాత్ర

- కాశీబుగ్గ సీతారామాలయం, తర్లకోట గ్రామంలో యాత్ర ప్రారంభం

**పలాస, జులై 16 (వార్త):** పవిత్ర ఆషాఢ శుక్ల ద్వితియా నాడు గురువారం పలాసలో పూరీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. భగవాన్ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిల మూడు భవ్య రథాలను భక్తులు లాగుతూ గుండిచా మందిరానికి చేర్చే పవిత్ర కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం 8:52 గంటల తర్వాత ద్వితియా తిథి ప్రారంభంతో అధికారికంగా రథయాత్ర మొదలైంది. పలాసలోని ప్రధాన వీధుల్లో రథయాత్ర సాగగా, స్థానిక దేవాలయాలు, సంస్థలు ఏర్పాట్లు చేశాయి. భద్రతా ఏర్పాట్లు పూరీలో మాదిరిగానే స్థానిక పోలీసు, వాలంటీర్ల బృందాలు భక్తుల భద్రత, రాకపోకల నిర్వహణ కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. యాత్ర





ప్రారంభమయ్యే ముందు ఆలయ కమిటీ వచ్చి రథాల ముంగిట బంగారు చీపురుతో ఊడ్చటం ఇప్పటికీ కొనసాగుతున్న సంప్రదాయం. మధ్యాహ్నవేళ కదిలిన రథాలను సంధ్యా సమయానికల్లా స్వామి పిన్నిగారైన గుండీచా మందిరానికి చేరుస్తారు. వారం రోజులపాటు మూడు రథాలు అక్కడే ఉంటాయి. ఎనిమిదో రోజున తిరిగి రథాలెక్కి ప్రధానాలయం వద్దకు చేరుకుంటాయి. తిరుగు రథయాత్ర పూర్తయిన తర్వాతి రోజున. బోలెడన్ని బంగారు నగలతో అలంకరిస్తారు. ఈ అలంకారంలో మాత్రమే కరచరణాలతో దర్శనమిస్తాయి. మరుసటిరోజున విగ్రహాల ఎదుట భారీ మట్టిపాత్రలో పంచామృతాన్ని నివేదిస్తారు. ఆలయప్రవేశం లేని పితృదేవతలు ఈ పంచామృతాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారని ప్రతీతి. సామాన్య భక్తులు ఈ పంచామృతాన్ని స్వీకరించరు.

# ముద్రగడకు వైసీపీ నేతల ఘన నివాళి



**నరసన్నపేట, జులై 16 (వార్త):** నరసన్నపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో ముద్రగడ పద్మనాభంకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, నిరుపేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ముద్రగడ పద్మనాభం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన అంకితభావం, సమాజం పట్ల ఉన్న నిబద్ధత ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ముద్రగడ పద్మనాభం మరణం సమాజానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ముద్రగడ పద్మనాభంకు ఘనంగా నివాళులర్పించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


# మేడిపండు చందం.. తహసీల్దార్ కార్యాలయం!

**-బీటలు వారిన గోడలు**

**- పెచ్చులూడిన స్లాబులు**

**- ఐదేళ్లకే శిథిలమైన భవనం**

**సోంపేట, జులై 16 (వార్త):** సోంపేట తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ నాణ్యత ఐదేళ్లకే బట్టబయలైంది. బయటకు మాత్రం పూసిన రంగులతో ఎంతో అందంగా మెరుస్తున్నప్పటికీ లోపల ఏ గది చూసిన సర్వత్రా పగుళ్ళమయం అన్నట్లు మారింది. అలాగే స్లాబులు కూడా ఎక్కడికక్కడ పెచ్చులు ఊడుతూ అధికారులు, సిబ్బందికి ఆందోళన కలిగిస్తుంది. మొత్తం పై చూస్తే సుమారు



అయిదారేళ్ళ క్రితం నిర్మించిన లక్షలాది రూపాయల వ్యయంతో కూడిన ఈ భవనం అచ్చం మేడిపండులా ఉందంటే అతిశయోక్తి కాదు. 2014- 19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ భవనం అన్ని వర్గాలను ఆశ్చర్యంతో పాటు ఆందోళన కలిగిస్తుంది. నిర్మాణం లో నెలకొన్న






నాణ్యత ప్రమాణాలు సక్రమంగా లేకపోవడంతో ఏ గోడ చూసిన బీటలు వారడంతో కార్యాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పట్టుమని పదేళ్ళు కూడా ఇంకా నిండకుండానే ఇలా బీటలు వారడం, పెచ్చులు ఊడిపోవడం చూస్తుంటే ప్రతి ఒక్కరూ ఈ నిర్మాణంపై విమర్శలు కురిపిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వలాభం, ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం మొదలైన కారణాలతో ఈ నిర్మాణం మమ అనిపించేశారు. అప్పటి తాసిల్దార్ గురు ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన నిర్మాణం పనులు వేగవంతంగా జరిగినప్పటికీ నాణ్యత విషయంలో మాత్రం రాజీ పడినట్లు స్పష్టమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పుడే ఇంత అధ్వానంగా ఉంటే మరికొద్ది కాలంలో ఈ భవనం పరిస్థితి మరింత అద్వాన్నం కాక తప్పదని పలువురు పేర్కొంటున్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ దారిలో ముళ్ల కంచెలు

**- ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**- వెంటనే తొలగించాలని అధికారులను కోరుతున్న ప్రజలు**

**నరసన్నపేట, జులై 16 (వార్త):** నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు నడిచే మార్గంలో ముళ్ల కంచెలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతంలో ఈ విధంగా ముళ్ల కంపలు వేయడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన నడక మార్గంలో ముళ్ల కంచెలు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వృద్ధులు, మహిళలు, చిన్నారులు మరింత అసౌకర్యానికి గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

రద్దీ సమయాల్లో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నడిచే మార్గంలో ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి వెంటనే వాటిని తొలగించి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను ఆర్టీసీ అధికారులు గుర్తించి తగిన చర్యలు చేపడతారో లేదో వేచి చూడాల్సి ఉంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాంప్లెక్స్ ఆవరణలో తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పర్యావరణం ప్రాచీన కట్టడాల

# పరిరక్షణ దిశగా అడుగులు

**- మందస ప్రజలను అభినందించిన రాజవంశీయుడు సీపీ సింగ్‌దేవ్**



**మందస, జులై 16(వార్త):** అలనాటి మంజూష.. నేటి మందసలో ఓ వైపు పచ్చదనం, పర్యావరణం కాపాడడానికి అడుగులు పడుతున్నాయి. మరో వైపు ప్రాచీన కట్టడాల పరిరక్షణకు ప్రకృతి ప్రేమికులు కృషి చేస్తున్నారు. మందసలో జరుగుతున్న పర్యావరణ రక్షణ, ప్రాచీన కట్టడాలను పరిరక్షణలపై మంజూష సంస్థానాన్ని పరిపాలించిన రాజ వంశీయులు కర్నల్ రాజా సి.పి.సింగ్ దేవ్ గో గ్రీన్ మందసను అభినందించారు. ఈ మేరకు ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఆయన మాటల్లోనే.. మన మంజూష ప్రాంత చారిత్రక వారసత్వ సంపదను కాపాడటంలో మీ సంస్థ(సోహోం) ప్రదర్శిస్తున్న దీక్షాదక్షతలు, అలాగే ప్రస్తుత కాలంలో అత్యంత అనివార్యమైన పర్యావరణ పరిరక్షణ, వృక్షోత్పత్తికై మీరు గో గ్రీన్ సంస్థ ద్వారా చేస్తున్న కృషి అభినందనీయం. ఈ రెండు ముఖ్యమైన అంశాలపై మన ప్రజలలో సామాజిక స్పృహ, చైతన్యం నెలకొనడం నాకు ఎంతో హర్షాన్ని కలిగిస్తోంది. మీ సంస్థయొక్క ఈ సత్సంకల్పం, నిరంతర శ్రమ సమీప భవిష్యత్తులోనే ఘనమైన ఫలితాలను ఇస్తాయని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. నా ప్రాణాధికమైన మంజూష ప్రజలు తలపెట్టిన ఈ మహత్కార్యాలన్నీ దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షిస్తూ, నా హృదయపూర్వక శుభాకాంక్షలు.. అంటూ అభినందనలు తెలిపారు. మందస రాజవంశీయులు కర్నల్ రాజా సి.పి.సింగ్ దేవ్ ప్రత్యేకంగా తెలిపిన అభినందనలు గో గ్రీన్ ప్రతినిధులకు, మందస ప్రజలకు మరింత ఆత్మ విశ్వాసం, ఉత్సాహం నింపింది.

# శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రం

**- చోడవరం కేంద్రంలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం**

**- కొత్త భవనం నిర్మించాలి**

**- మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానికుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జులై 16 (వార్త):** చోడవరం సచివాలయం పరిధిలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో పశువైద్య సేవల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలమై ప్రమాదకరంగా మారడంతో పశువులకు వైద్య సేవలు అందించడంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్య సహాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న భవనం దయనీయ స్థితికి చేరుకోవడంతో పశువులకు సకాలంలో చికిత్స అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వర్షాకాలం, ఎండాకాలంలో కూడా భవనం వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో సేవల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. స్థానికుల కథనం ప్రకారం, గత కొన్నేళ్ల క్రితం పంచాయతీ కార్యాలయ భవనంలోనే తాత్కాలికంగా ఈ పశువైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే అనంతరం సరైన నిర్వహణ, మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన చోడవరం పరిసర గ్రామాల్లో పశు సంపద ప్రధాన జీవనాధారంగా ఉన్న నేపథ్యంలో పశువైద్య కేంద్రాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి శిథిలమైన భవనానికి మరమ్మతులు చేపట్టడం లేదా కొత్త భవనం నిర్మించి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# బైరాగిపేటలో వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర

**- భక్తుల జయజయధ్వానాల మధ్య సాగిన రథోత్సవం**

**- సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**జలుమూరు, జులై 16 (వార్త):** బైరాగిపేటలోని రాజుల కాలం నాటి చారిత్రక శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలు, జయజయధ్వానాల నడుమ రథోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగింది. శ్రీముఖలింగేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో ఎండోమెంట్స్ శాఖ అధికారి ఏడుకొండలు, జగన్నాథ స్వామి ఆలయ పీఠాధిపతి మోహంత్ దాస్ ఆధ్వర్యంలో





ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా స్వామివారి రథయాత్రను ప్రారంభించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగుతూ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. రథయాత్ర సందర్భంగా నిర్వహించిన సాంప్రదాయ కోలాటం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక కళాకారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుని ఉత్సవానికి మరింత శోభను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సతీసమేతంగా ఆలయానికి చేరుకుని శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కోలాటం ప్రదర్శనను తిలకించారు.

ఆలయ పీఠాధిపతి మోహంత్ దాస్ మాట్లాడుతూ, ఉత్సవాల చివరి రోజు జరిగే మరుధాసిమి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖలింగం మాజీ సర్పంచ్ల సతీష్ మరియు గుంట కర్ణవీరుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జగన్నాథ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని వక్తలు ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు పాల పంపిణీ

**- పాల నిల్వలను పరిశీలించిన సీడీపీఓ వంశీప్రియ**

**- 198 అంగన్‌వాడీ కేంద్రాలకు నేడు సరఫరా**



**సారవకోట, జులై 16 (వార్త):** సారవకోటలోని సీడీపీఓ కార్యాలయానికి చేరిన పాల నిల్వలను ప్రాజెక్టు అధికారిణి సీహెచ్. వంశీప్రియ గురువారం పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో భాగంగా పాల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సారవకోట సమీకృత శిశు అభివృద్ధి ప్రాజెక్టు పరిధిలోని జలుమూరు, సారవకోట మండలాల్లో ఉన్న మొత్తం 198 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పాల నిల్వలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గురువారమే ఆయా కేంద్రాలకు పాల సరఫరా పూర్తి చేస్తామని చెప్పారు. పాల నాణ్యత, నిల్వ విధానాలను పరిశీలించిన అనంతరం, నిర్ణీత సమయానికి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆమె ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలు సమర్థవంతంగా అమలు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**- మహిళలు, చిన్నారుల రక్షణకు**

**పోలీస్ విభాగాల సేవలను తెలిపిన శక్తి టీం**



**సారవకోట, జులై 16 (వార్త):** విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు సారవకోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు గిరిధర్, ఆది నారాయణ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై పలు ముఖ్యమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరిగే దాడులు, వేధింపులను అరికట్టేందుకు పోలీస్ శాఖలోని వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళల భద్రత, బాలల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించేందుకు ఉపయోగపడే ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలతో పాటు ప్రాథమిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని శక్తి టీమ్ సభ్యులు సూచించారు. చట్టాలపై అవగాహన ఉండటం ద్వారా నేరాల నివారణతో పాటు వ్యక్తిగత భద్రత కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కిషోర్‌కు చిన్నజీయర్ స్వామి ఆశీస్సులు



**మందస, జులై 16(వార్త):** త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామిని ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవాసుదేవ సేవాసమితి సభ్యుడు శానాపతి కిషోర్ కుమార్ కలిసి, ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. టెక్కలి వచ్చిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామిని కిషోర్ కుమార్ కలియగా.. కొంత సేపు ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అందించిన ప్రవచనాలను కిషోర్ కుమార్ విని, ఆధ్యాత్మిక భావన పొందారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కరతల తిరుపతి, సాసుమాన యోగి పాల్గొన్నారు. అనంతరం వారు మందస వచ్చి, స్వామి పర్యటన వివరాలను, ఆధ్యాత్మిక ప్రసంగాలను స్థానిక భక్తులకు వివరించారు.

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలి

**పలాస, జులై 16 వార్త):** మెలియాపుట్టి మండలం భరణికోట ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సవర నవ్య శ్రీ అనే విద్యార్థిని బుధవారం పాఠశాలలోని భవనంపై నుండి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోబోయింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని ఆయన పరామర్శించారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ భరణికోటలో ఉపాధ్యాయులు మందలించడం వల్ల విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని, ఆత్మహత్యాయత్నం సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆశ్రమ పాఠశాలలో కౌన్సిలింగ్ లను నిర్వహించాలని డిమాండ్ చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మందసలో ఘనంగా జగన్నాథుని రథయాత్ర



**మందస, జులై 16(వార్త):** మందస పట్టణంలో శ్రీజగన్నాథుని రథయాత్ర ఘనంగా ప్రారంభమయ్యింది. బలభద్ర, సుభద్ర సమేత శ్రీజగన్నాథుడు మందస బస్టాండ్లోని జగన్నాథ కాంప్లెక్స్ నుంచి భక్తుల పూజలు అందుకుంటూ శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గల శ్రీబాలాజీ ఆలయం వరకు రథంలో వెళ్లాడు. బలరాముడు, శ్రీకృష్ణుడు ఆహ్వానం మేరకు జగన్నాథుడు అత్తవారింటికి వెళ్తాడని భక్తుల నమ్మకం. ప్రతీ ఇంటి వద్ద రథాన్ని నిలుపగా మహిళలు పసుపు, కుంకుమ, ధూప, దీప, నైవేధ్యాలు పూజులు చేశారు. కాగా, స్వామివారి రథయాత్ర ప్రారంభం అనంతరం మరుసటి రోజు నుంచి అన్ని ప్రాంతాల్లో అవతారోత్సవాలు జరుగుతుండగా, మందసలో అందుకు విరుద్ధంగా తొమ్మిది రోజుల పాటు స్వామివారు శ్రీబాలాజీస్వామి ఆలయంలో ఉండి, తిరిగి ఆలయానికి చేరుకున్న అనంతరం మందసలో శ్రీజగన్నాథుని దశావతారాల ఉత్సవాలు జరుగుతాయి. రాజుల కాలం నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.



## సర్‌ను సద్వినియోగం చేసుకోండి



**జి.సిగడాం, జులై 16 (వార్త):** కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి ఇచ్చిన పదిరోజులు అదనపు గడువును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలంలో బిఎల్ఓలు, బిఎల్ఏలు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరు ఎవరి ఓట్లు ఎక్కడికో పోతాయనే ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి దశలోనూ ఇచ్చిన గడువు లోగా అభ్యంతరాలను ఎత్తి చూపుతూ సమస్యలు ఉన్నప్పుడు సరిచేసుకోవాలని అన్నారు.. ఇప్పటివరకు ఈ ప్రక్రియలో బిఎల్ఓ ల పనితీరును తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు ఇప్పటికే 96 శాతం సర్ సర్వే పూర్తి చేశామని మిగతా 4శాతం సర్వే గడుపు లోపు పూర్తి చేయాలన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సమన్వయము చేస్తున్న.ఈ సమావేశంలో డీటీ ఎన్ నిర్మల, ఆర్ఐ రాధ, విర్వో జగన్నాథం, నర్సింగరావు, రాజశేఖర్, లక్ష్మణరావు, సీతయ్య, నీలకంతం, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయితో ఒడిశా వాసి అరెస్టు



**మందస, జులై 16(వార్త):** గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలం హరిపురం రైల్వే స్టేషన్ లో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఒడిశా రాష్ట్రంలోని రాయగడ గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 1,250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం. తిరుపతిరావు, మందస ఎస్ఐ కె. కృష్ణ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. నిందితుడిపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పైప్‌లైన్ లీకేజీతో జలమయం..
## స్కూల్ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు

**ఆమదాలవలస, జులై 16 (వార్త):** ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ వీధిలో ప్రభుత్వ పాఠశాల ప్రధాన గేటు వద్ద మున్సిపల్ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా రోడ్డంతా నీటితో నిండిపోయింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు గేటు గుండా లోపలికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్థానికుల కథనం ప్రకారం, ఇదే వీధిలో మరోచోట కూడా పైప్‌లైన్ లీకేజీ ఉండటంతో వీధి మొత్తం జలమయంగా మారుతోంది. పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీల కారణంగా తాగునీటి వృథాతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొంటూ, మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు



**పోలాకి, జులై 16 (వార్త):** ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని అందించి ఆర్థికంగా బలోపేతం చేసే అవకాశాలు ఉన్నాయని ఉద్యానవన శాఖ అధికారి సునీత తెలిపారు. గురువారం పోలాకి మండలం రాజపురం మత్స్యకార గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని ఆయిల్ ఫామ్ సాగు ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలను పంపిణీ చేయడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, ఇతర సహాయ సహకారాలు అందజేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి చూపాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంట సాగు ప్రారంభమైన రెండు సంవత్సరాల తర్వాత దిగుబడులు రావడం ప్రారంభమై రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా లాభదాయకమైన ఈ పంటను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని వివరించారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకుని ఉద్యానవన శాఖ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలమైన కాలువ..
# దయనీయ స్థితిలో శ్మశాన దారి

- మృతదేహాల తరలింపునకు తీవ్ర ఇబ్బందులు
- కాలువపై కొత్త సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి




**నరసన్నపేట, జులై 16 (వార్త):** నరసన్నపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్మశానవాటికకు వెళ్లే మార్గంలో కాలువపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంత్యక్రియల కోసం మృతదేహాలను స్మశానవాటికకు తరలించే సమయంలో అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువపై ఉన్న పలకలు పగిలిపోవడంతో నడిచి వెళ్లడానికే ప్రమాదకరంగా మారిందని, వాహనాల రాకపోకలు కూడా కష్టంగా మారాయని వారు తెలిపారు. దీంతో ప్రతి అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే కాలువపై కొత్త సిమెంట్ పలకలు ఏర్పాటు చేసి స్మశానవాటికకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు. స్మశానవాటికకు వెళ్లే మార్గం ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయమని, దీనిపై సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నవ్యశ్రీ ఆత్మాహత్యాయత్నానికి
# బోధకులే కారణమా?

-పరామర్శించిన ప్రజాసంఘాల నాయకులు

**పలాస, జులై 16 (వార్త):**మెళియాపుట్టి మండలం భరణికోటలో గల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల లో జరిగిన 10 వతరగతి చదువుతూ పలాసా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సవర నవ్యశ్రీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తల్లి తండ్రులకు, ప్రజలకు స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత వేధింపులే కారణమని, విద్యార్థి నవ్యశ్రీ మాముందు సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ ఆరోపణల నిజానిజాలను సంబంధిత అధికారులు నిష్పాక్షికంగా, సమగ్రంగా విచారణ చేసి భవిష్యత్ లో మరో పిల్లలు బలి కాకుండా చూడాలని వసంతపై చర్యలు తీసుకోవాలని సిపిఐ యంయల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు మద్దిల రామారావు, సిపిఐ యంయల్ జనశక్తి జిల్లా నాయకులు కోనేరు రమేష్, గిరిజన సంఘాల నాయకులు సవర నరిశింహులు, కుమార్ బంగ్లా, సవర రవి, సవర సింహాద్రి డిమాండ్ చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి కూడా అనేక అనుమానాలు, పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత తరచూ పాఠశాల ముగిసే సమయానికి ముందే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ఆందోళనకు గురౌతున్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఉపాధ్యాయ సిబ్బంది భాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేసారు. భయాందోళనకు గురికాకుండా నైట్ స్టడీ సమయం వరకు పాఠశాల సిబ్బంది మొత్తం అక్కడే ఉండాలని చూసించారు. ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత సాయంత్రం 5 గంటలకే పాఠశాలను విడిచి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమని తేలితే, విద్యార్థుల భద్రత, విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినట్లుగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఐటిడిఏ అధికారులు ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



## అధికార పార్టీ నేతలతో
# ఎమ్మార్వో సర్ సమావేశం

- ఎంపీపీ దేవదాస్ రెడ్డి ఆరోపణ



**కంచిలి, జులై 16 (వార్త):** ఓటర్ల జాబితా ప్రక్రియ పది రోజులు పొడిగింపు నేపథ్యంలో కంచిలి తహసిల్దార్ రమేష్ కుమార్ బిఎల్వోలు, బిఎల్ఎలుతో నిర్వహించాల్సిన సమావేశాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ప్రోటోకాల్ లేని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించి వ్యవహారాన్ని పూర్తిగా పక్కదారి పట్టించారని కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇచ్చి వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులకు, బిఎల్ఏ లకు కూడా కూర్చునే అవకాశం లేకుండా కేవలం టిడిపి నేతలకు సమావేశంలో పెద్దపీట వేసి సమావేశం నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా వడపోత కార్యక్రమం ఎంతో క్రియాశీలకమైనదని దీనిపై ఇప్పటికే అనేక రాష్ట్రాల్లోనూ, ఆంధ్రప్రదేశ్లోనూ గందరగోళం నెలకొని ఉందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అన్ని పార్టీల బిఎల్ఏలకు ఆహ్వానించి సమావేశంలో చర్చించాల్సి ఉన్నప్పటికీ కేవలం ఒకే ఒక పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని తాసిల్దారును ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి ఈ సమావేశం మళ్లీ అందరికీ ఆమోదయోగ్యంగా నిర్వహించాలని కోరారు.

## దానయ్య కుటుంబానికి
# యాదవ సంఘం అండ

- మాజీ మంత్రి సీదిరిపై మండిపాటు
- రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత
- న్యాయం జరిగే వరకు పోరాటం
- యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరావు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు

**పలాస, జులై 16 (వార్త):** సూదికొండ ప్రమాద బాధిత దుబ్బ దానయ్య కుటుంబానికి జిల్లా యాదవ సంఘం నాయకులు గురువారం పరామర్శించారు.'దోషులను కాపాడే ప్రయత్నాలు జరిగాయి' అంటూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై తీవ్ర విమర్శలు చేశారు. పలాస మండలం సూదికొండలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య కుటుంబాన్ని జిల్లా యాదవ సంఘం నాయకులు పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెబుతూ అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. టీడీపీ తరఫున జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సాయంలో భాగంగా తొలి విడతగా రూ.50 వేల నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన మిగిలిన సాయం కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ దానయ్య మృతికి కారణమైన ప్రమాదం అనంతరం నిందితులను కాపాడేందుకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు వరుస తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒక నిరుపేద కుటుంబం జీవితాన్ని చిదిమేసిన ఘటనలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన నాయకుడు, నిజాలను దాచిపెట్టే ప్రయత్నాలు చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. దానయ్య కుటుంబం నేడు దిక్కుతోచని స్థితిలో నిలిచిందని, అలాంటి సమయంలో బాధితులకు అండగా నిలవాల్సింది పోయి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. నేరం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత అందరిదేనని పేర్కొన్నారు. యాదవ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, సమాజంలో వైషమ్యాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని మండిపడ్డారు. మాజీ మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి చర్యలకు పాల్పడటం అత్యంత ఖండనీయమన్నారు. దానయ్య కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు జిల్లా యాదవ సంఘం అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దోషులకు చట్టపరంగా కఠిన శిక్ష పడాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన సహాయం వెంటనే పూర్తిగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఎవరైనా ఆధారాలు తారుమారు చేయాలని లేదా దర్యాప్తును ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546